

ఆక్రందన..అంతకు మించిన వేదన!
రోడ్డుపై గేదెను తప్పించబోయి బైక్ బోల్తాపడి యువకుడు మృతిచెందిన ఘటన హనుమంతునిపాడు మండలం వేములపాడులో జరిగింది. - 8లో..



దైవదర్శనానికి వెళ్లొస్తూ.. మృత్యు ఒడికి..
ఆటో బోల్తాపడి ఓ వృద్ధుడు మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. - 8లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం 42 /31
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికం. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

యంత్రాలతోనే మానవవ్యర్థాల తొలగింపు

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న జేసీ

ఒంగోలు అర్బన్: మానవ వ్యర్థాల తొలగింపు, శుభ్రపరిచే కార్యక్రమాల్లో మనుషులను కాకుండా తప్పనిసరిగా యంత్రాలనే వినియోగించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. మాన్యువల్ స్కావెంజర్స్ వినియోగం నివారణపై బుధవారం ప్రకాశం భవనంలో విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో జేసీ మాట్లాడుతూ పారిశుధ్య కార్యకలాపాలకు వినియోగించే కార్మికుల సంక్షేమం కూడా ఎంతో ముఖ్యమని ప్రాధాన్యతతో పర్యవేక్షించాలన్నారు. వారికి అవసరమైన రక్షణ పరికరాలను ఔట్‌సోర్సింగ్ సంస్థలు సమకూరుస్తున్నాయో లేదో పరిశీలిస్తుండాలన్నారు. దీనిలో ఏఎస్పీ నాగేశ్వరరావు, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, హౌసింగ్ పీడీ పేరయ్య, డివిజనల్ అధికారి పద్మ, రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఏసుదానం, మున్సిపాలిటీల అధికారులు పాల్గొన్నారు.

జనరల్ సైన్స్ పరీక్షకు 454 మంది గైర్హాజరు

ఒంగోలు: పదో తరగతి అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం జనరల్ సైన్స్ పరీక్షను జిల్లాలోని 44 సెంటర్లలో నిర్వహించారు. మొత్తం 4917 మంది హాజరుకావాల్సి ఉండగా, అందులో 4463 మంది మాత్రమే హాజరయ్యారు. స్క్వాడ్ బృందాలు 18 సెంటర్లను తనిఖీ చేశాయని, ఎక్కడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

రైస్‌మిల్లుల్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్



గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద రైస్‌మిల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడులోని వెంకటేశ్వర రైస్ మిల్లు, గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో ఉన్న శ్రీ హనుమ రైసు మిల్లులను జేసీ జే శ్రీనివాసులు బుధవారం మధ్యాహ్నం పరిశీలించారు. ప్రభుత్వం రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని పీడీఎస్ రైస్‌గా మార్చి ప్రభుత్వానికి రేషన్ కోసం ఇవ్వాల్సిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం స్టాకు పరిశీలించాల్సిందిగా సివిల్ సప్లెస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు, జిల్లా సివిల్ సప్లెస్ మేనేజర్ గ్లోరియా, తహసీల్దార్ రజని, ఆర్ఐ అనూష, వీఆర్‌ఓలు రమణ, అంకమ్మ, రాంబాబు సివిల్ సప్లెస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తాచాటిన నాగులుప్పలపాడు ఎడ్లు

రాజంపల్లి (పెద్దారవీడు): మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లిలో శ్రీదేవి భూదేవి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి ఆరు పండ్ల సైజు విభాగంలో పశు బలప్రదర్శన బుధవారం నిర్వహించారు. నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ఉప్పాళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్ల జత 4 వేల అడుగులు లాగి మొదటి స్థానంలో నిలవడంతో ప్రగళ్లపాడు గ్రామానికి చెందిన గుండ్ల యల్లారావు రూ.35 వేలు, కంభం మండలం సూరేపల్లెకు చెందిన బీరం వెంకటరెడ్డి, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం వంగిపురం గ్రామానికి చెందిన యు.సుధారాణిల ఎడ్లజత 3753 అడుగులు లాగి రెండో స్థానం, బోడిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దుగ్గెంపూడి కొండారెడ్డి రూ.20 వేలు, అర్ధవీడు మండలం అంకభూపాలెం గ్రామానికి చెందిన వల్లెల ధర్మారెడ్డి ఎడ్లజత వెయ్యి అడుగులు లాగి మూడో స్థానం, రాజంపల్లి గ్రామానికి చెందిన ఏర్వ మల్లికార్జునరెడ్డి రూ.10 వేలు, ఏనుగుల దిన్నెపాడు గ్రామానికి చెందిన సంపతి గురవయ్య, కుంచారపు పోలయ్యల ఎడ్లజత 583 అడుగులు లాగి నాల్గవ స్థానం, చట్లమిట్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోదాపు సత్యనారాయణరెడ్డి రూ.5 వేలు పంపిణీ చేశారు. న్యాయనిర్ణేతలుగా సీహెచ్ శ్రీరామిరెడ్డి, ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, ఉయ్యూరు సాంబిరెడ్డి, వెన్నా బోడిరెడ్డి, జీ రామిరెడ్డి వ్యవహరించారు.

సీఎంకు సెల్యూట్..

ప్రభుత్వ ఉద్యోగులకు మేలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. నాడు ప్రజాసంకల్ప యాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేశారు. ఉద్యోగుల భద్రత కోసం గ్యారెంటెడ్ పెన్షన్ స్కీంకు ఆమోద ముద్రవేశారు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారు. వీటితో పాటు బుధవారం కేబినెట్ తీసుకున్న పలు నిర్ణయాలపై అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమకు అన్నిరకాలుగా మేలు చేస్తున్న సీఎంకు ఎల్లప్పుడూ అండగా ఉంటామంటూ సెల్యూట్ చేస్తున్నారు.



- సీపీఎస్ రద్దు..మేలు చేసేలా జీపీఎస్
- కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఆమోదం
- కేబినెట్ నిర్ణయాలపై ఉద్యోగుల హర్షం
- సీఎం జగన్‌కు రుణపడి ఉంటామంటున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు
- మా జీవితాలు మార్చేశారంటూ ఆనందం

ఒంగోలు అర్బన్:

ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆ మేరకు ఉద్యోగులకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకుంటూ కేబినెట్‌లో ఆమోదం తెలిపింది. పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఉద్యోగ సంఘాలు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడంపై వారు సంతోషం వెలిబుస్తున్నారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న తమకు వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం జీవితాలను మార్చేసిందంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాడు పాదయాత్రలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిన జగన్ కొత్తగా జీపీఎస్ (గ్యారెంటెడ్ పెన్షన్ స్కీము) తీసుకొచ్చి ఉద్యోగ సంఘాలు, ఉద్యోగుల మన్ననలు పొందుతున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జీపీఎస్ తీసుకొచ్చిన ముఖ్యమంత్రికి ఉద్యోగ సంఘాల నాయకులు నీరాజనం పలుకుతున్నారు. అంతేకాకుండా ఇవ్వాల్సిన సమయం కంటే ముందుగానే 12వ పీఆర్‌సీ కమిటీ నియమిస్తూ కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో పనిచేసే వారికి 12 నుంచి 16 శాతం హెచ్‌ఆర్‌ఏ పెంచడం కొత్త జిల్లాలో పనిచేసే ఉద్యోగులకు ఎంతగానో ఉపకరిస్తుందని ఉద్యోగులు అంటున్నారు. రాష్ట్ర విభజన అనంతరం గత చంద్రబాబు ప్రభుత్వం అప్పులపాలు చేయడం, కోవిడ్‌తో అతలాకుతలమైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన మాట మేరకు ఉద్యోగులకు అండగా నిలబడటం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని ఉద్యోగులు కీర్తిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మొత్తం సుమారు 28 వేల మందికి లబ్ధి చేకూరనుంది. దీంతో పాటు 600 పైగా కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. వారిలో ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ చేయనున్నారు.

సీపీఎస్ కంటే జీపీఎస్ ఎంతో ప్రయోజనం



సీపీఎస్ రద్దు చేసి జీపీఎస్ విధానం తీసుకురావడాన్ని హర్షిస్తున్నాం. దీనిలో కూడా మరింత ప్రయోజనం కలిగేలా పీఆర్‌సీ, హెల్త్ కార్డులు కూడా వర్తింప చేస్తే మరింత బాగుంటుంది. అయినా సీపీఎస్‌తో పోలిస్తే జీపీఎస్ ఎంతో ప్రయోజనంగా ఉంది. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయడం సంతోషకరం. ముఖ్యమంత్రి నిర్ణయాలకు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– పీ రాము, వీఆర్‌ఓ సంఘం జిల్లా అధ్యక్షుడు

సీఎం జగన్‌కు ఉద్యోగులు అండగా ఉంటారు





రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల తీసుకున్న నిర్ణయం హర్షణీయం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. పదేళ్లుగా ఎదురుచూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ సంచలనాత్మక నిర్ణయం. 2004 నుంచి ఎదురుచూస్తున్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. ఇచ్చిన మాటపై నిలబడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఎటువంటి ఆందోళనలు చేయకుండానే ఉద్యోగుల మంచి కోరుతూ పీఆర్‌సీ కమిటీని ప్రకటించిన సీఎంగా చరిత్రకెక్కారు. వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు ఇస్తున్నందుకు ధన్యవాదాలు. తమ సంక్షేమం చూస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఉద్యోగులు ఎల్లప్పుడూ అండగా ఉంటారు.

– కూచిపూడి శరత్ బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ఎన్నో ఏళ్ల కల నెరవేరింది



2002లో కాంట్రాక్టు ఉద్యోగిగా జాయిన్ అయ్యి ఎన్నో ఏళ్లుగా రెగ్యులర్ చేస్తారని ఎదురు చూశాం. అయితే జగనన్న మా కలను నెరవేర్చారు. అన్నీ విధాలుగా ఆయన పక్షాన నిలుస్తాం. ఇచ్చిన మాట మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో వేలాది కుటుంబాలు జీవితాంతం గుర్తు ఉంచుకుంటాయి.

– ఏ.ప్రశాంతి, ల్యాబ్ టెక్నీషియన్, పీహెచ్‌సీ, ప్రాసంగులపాడు

ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగులంతా సంతోషం



ప్రభుత్వం ఉద్యోగుల కోసం తీసుకున్న నిర్ణయాలతో ఉద్యోగులంతా ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు చేసేందుకు అంగీకారం, సీపీఎస్ రద్దు చేసి జీపీఎస్ విధానంతో పాటు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నాం. జగన్ నిర్ణయాలకు ఏపీ జేఏసీ అమరావతి తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్

జగనన్నకు రుణపడి ఉంటాం



కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేలా నిర్ణయం తీసుకున్న సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. పైగా డీఏ, హెచ్‌ఆర్‌ఏలను కూడా తొలగించారు. జగనన్న పాదయాత్రలో రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఆయనను కాంట్రాక్టు ఉద్యోగులంతా జీవితాంతం గుర్తుపెట్టుకుంటాం. మరో 30 ఏళ్లు ఆయన సీఎంగా ఉండాలి. అప్పుడే మాలాంటి ఉద్యోగులందరికీ న్యాయం జరుగుతుంది.

– దుద్దు బుజ్జిబాబు, కాంటాక్టు ఫార్మసిస్ట్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్

20 ఏళ్లకు ఫలించిన కల..



వైద్యశాఖలో 2003 సంవత్సరంలో కాంట్రాక్టు ఉద్యోగిగా చేరాను. అప్పటి నుంచి కాంట్రాక్టు ఉద్యోగిగానే కొనసాగుతున్నాను. రోజులు గడిచిపోతున్నాయి. ప్రభుత్వాలు మారిపోతున్నాయి. అయినా సరే మమ్మల్ని పట్టించుకునే నాయకుడే లేరనుకున్నాం. ఒక్క రోజు అయినా సరే ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేయాలనే నా 20 ఏళ్లనాటి మా కల నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబం మొత్తం రుణపడి ఉంటాం.

– గజ్జా వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్ఏ, సంజీవరాయుడుపేట పీహెచ్‌సీ

జీపీఎస్ ఉద్యోగులకు భరోసా



దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న మెరుగైన పెన్షన్ విధానం తాజాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన జీపీఎస్‌తో సాధ్యపడింది. కనీసం 50 శాతం పెన్షన్‌తో పాటు డీఏలు వర్తించేలా అనుమతించడం ఒక గొప్ప నిర్ణయం. లక్షలాది మంది ఉద్యోగుల కల నెరవేరింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆర్టీసీ ఉద్యోగులకు జీవితాల్లో వెలుగులు నింపారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఈపీఎఫ్ ద్వారా రూ.3 వేలు పెన్షన్ కూడా రాని పరిస్థితుల్లో పెన్షన్ ఒక కల అనుకునే ఆర్టీసీ ఉద్యోగులకు కూడా జీపీఎస్‌ను అనుమతించడం చారిత్రాత్మకం. ఇంతటి మేలు చేసిన ముఖ్యమంత్రికి ప్రతి ఉద్యోగి బాసటగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– ఆవుల రాధాకృష్ణ, వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సంతోషకరమైన నిర్ణయం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీసును క్రమబద్ధీకరించటం ఎంతో సంతోషకరమైన నిర్ణయం. 2008 సంవత్సరం నుంచి పని చేస్తున్నాను. మా ఉద్యోగం ఎప్పుడు రెగ్యులర్ అయి జీవితం సంతోషంగా మారుతుందా అని ఎదురు చూస్తున్నాం. ఇప్పుడు సీఎం జగనన్న నిర్ణయంతో ఒక్కసారిగా కల నిజమైనట్లుంది.

– ఏ రత్నరాజు, తెలుగు లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొండపి

గత ప్రభుత్వాలేవీ పట్టించుకోలేదు



16 ఏళ్లుగా తర్లుపాడు మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్నాను. మమ్మల్ని రెగ్యులర్ చేయాలని గతంలో చాలా ప్రభుత్వాలను కోరాం. అయినా స్పందించలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మమ్మల్ని రెగ్యులర్ చేస్తూ తీసుకున్న నిర్ణయం జీవితంలో మర్చిపోలేం.

– పెద్దయ్య, జూనియర్ ఇంజినీర్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

హత్య చుట్టూ ఎల్లో రాజకీయం

- భూ వివాదాలు, కుటుంబ గొడవల నేపథ్యంలో మహిళ హత్య
- వాస్తవాలకు విరుద్ధంగా ఎల్లో గ్యాంగ్ శవ రాజకీయాలు
- తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు కొండపి టీడీపీ ఎమ్మెల్యే హైడ్రామా
- ఎమ్మెల్యే తీరును తప్పుపడుతున్న గ్రామస్తులు
- పదిహేడేళ్లుగా వివాదాలు, పోలీస్ కేసులు
- విచారణను వేగవంతం చేసి నిగ్గుతేల్చిన పోలీసులు
- నిందితుడు సవళం కొండలరావును అరెస్ట్ చేసిన పోలీసులు



రిమ్స్ వద్ద పోలీసులతో వాగ్వాదం చేస్తున్న ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీ నాయకులకు, ఎల్లో గ్యాంగ్‌కు ఏ చిన్న విషయం దొరికినా దానిని రాజకీయం చేయటం..అధికార పార్టీపై తోసేయడం పరిపాటిగా మారింది. అవి స్నేహితుల మధ్య చిన్నపాటి ఘర్షణలైనా.. కుటుంబ కలహాలైనా.. వివాహేతర సంబంధాలైనా... ఇలా ఏ అంశమైనా...రాజకీయానికి ముడిపెట్టి పబ్బం గడుపుకోవాలన్న వారి లక్ష్యంగా కనిపిస్తోంది. టంగుటూరు మండలం రావివారిపాలెంలో కుటుంబ కలహాల నేపథ్యంలో సవళం హనుమాయమ్మ హత్య జరిగింది. అది గ్రామానికి మొత్తం తెలిసిందే. అయితే కొండపికి చెందిన ప్రతిపక్ష టీడీపీ ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామి మాత్రం ఆ హత్యకు రాజకీయ రంగు పులిమి తన ప్రాపకాన్ని పెంచుకోవాలని పెద్ద ఎత్తు వేశాడు. దానికి తోడు ఇటీవల అధికార పక్షానికి చెందిన కొండపి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే డోలా వీరాంజనేయ స్వామి మరుగుదొడ్లలో అవినీతికి పాల్పడ్డారని ఆధారాలతో సహా నిరసనకు దిగారు. డోలా ఇంటి ముట్టడికి కూడా వెనుకాడలేదు. ఈ మరుగుదొడ్ల అవినీతితో దాదాపు రూ.22.50 కోట్లు డోలానే స్వయంగా కాజేశాడంటూ తీవ్ర స్థాయిలో ప్రచారం చేపట్టి ఆందోళనకు దిగారు. ఇది రాష్ట్ర స్థాయిలో పెద్ద చర్చకు కూడా దారి తీసింది. వాడివేడిగా మరుగుదొడ్ల అవినీతి వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్న సమయంలో హనుమాయమ్మ హత్య జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో సమీప బంధువే ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేశాడు. ఇక ఎమ్మెల్యే డోలాపై వస్తున్న మరుగుదొడ్ల అవినీతి వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకు హనుమాయమ్మ హత్యను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు రంగం సిద్ధం చేశారు. హనుమాయమ్మ మృతదేహం రిమ్స్‌లో ఉండడంతో హుటాహుటిన అక్కడకు చేరుకుని ప్రభుత్వంపై, అధికార పార్టీ నేతలపై ఆరోపణలు గుప్పించాడు. ఇక ఎల్లో మీడియా తనవంతు పాత్రను నిర్వహించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఆస్పత్రి వద్ద హైడ్రామా సృష్టించారు. గ్రామస్తులు, సొంత పార్టీ నేతలు చెబుతున్నా ఈ హత్యకు రాజకీయరంగు వేసి హంగామా చేశాడు.

అంగన్‌వాడీ టీచర్‌కు రాజకీయానికి ఏమిటి సంబంధం...

హతురాలు హనుమాయమ్మ రావివారిపాలెంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. అంగన్‌వాడీ టీచర్‌కు రాజకీయానికి సంబంధం ఏమిటన్నది టీడీపీ ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామికి స్పృహ లేకుండా పోయింది. అధికార పార్టీని ఇరుకున పెట్టాలని భావించటం ప్రతిపక్ష పార్టీలకు సర్వసాధారణం. అయితే కుటుంబ కలహాలతో హత్య జరిగితే అంగన్‌వాడీ టీచర్ హత్యకు ముడిపెట్టటం ఏమిటని నియోజకవర్గ ప్రజలే ఎమ్మెల్యే చర్యలపై విమర్శలు చేస్తున్నారు.

నిందితుడు కొండలరావుకు ఓటు హక్కే లేదు...

హనుమాయమ్మ కేసులో నిందితుడిగా ఉన్న సవళం కొండలరావుకు అసలు ఓటు హక్కు కూడా లేదు. అటువంటి వ్యక్తికి రాజకీయ విభేదాలు ఏముంటాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొండలరావు విద్యావంతుడు. బీటెక్ పూర్తి చేశాడు. సివిల్స్ పరీక్షలకు కూడా ప్రిపేరయ్యాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. విదేశాలకు కూడా వెళ్లి ఉద్యోగం చేసి మరీ ఇండియాకు వచ్చాడు. అయితే తన తల్లిని అనరాని మాటలు అనటం, సూటిపోటి మాటలు అనటం సహించలేకే ఈ హత్య చేశానని పోలీసుల ముందు అంగీకరించాడని సమాచారం. అయితే ఎల్లో గ్యాంగ్ మాత్రం ఈ హత్యకు రాజకీయ రంగు పులిమి హడావుడి చేసింది.

2007 నుంచే వీరి కుటుంబాల మధ్య గొడవలు...

సవళం కొండలరావు, హతురాలు సవళం హనుమాయమ్మ కుటుంబాల మధ్య 2007వ సంవత్సరం నుంచే కుటుంబ కలహాలు ఉన్నాయి. హతురాలు హనుమాయమ్మకు, ఆమె తోడికోడలికి మధ్య కూడా ఆస్తి తగాదాలు ఉన్నాయి. తోడి కోడలు ఆదిలక్ష్మికి కొండలరావు కుటుంబం మద్దతుగా ఉన్నారు. వీటి నేపథ్యంలో కూడా వీరి కుటుంబాల మధ్య టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదు చేసుకున్నారు. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవటం, రాజీ పడటంలాంటి సందర్భాలు కూడా చోటుచేసుకున్నాయి. పొలాల్లో కూడా గతంలో గొడవలుపడ్డారు. అందుకే ఈ హత్య కేసులో హతురాలి తోడికోడలు ఆదిలక్ష్మిని కూడా నిందితురాలిగా పోలీసులు చేర్చారు.

అన్నదమ్ముల ఆస్తుల గొడవలు పార్టీలకు రుద్దుతున్నారు



రాయివారిపాలెం గ్రామంలో మహిళను ట్రాక్టర్‌తో గుద్ది హత్య చేసిన ఘటనలో అన్నదమ్ముల గొడవలను టీడీపీ ఎమ్మెల్యే స్వామి, నాయకులు పార్టీలకు రుద్దుతున్నారు. చెంచురామయ్య, సుధాకర్ ఇద్దరూ అన్నదమ్ములే. ఇద్దరూ తెలుగుదేశం పార్టీకి చెందిన వారే. హత్య చేసిన కొండలరావుకి కనీసం ఓటు హక్కు కూడా లేదు. అన్నదమ్ముల మధ్య ఆస్తి తగాదాలతో గతంలో పోలీసు స్టేషన్లో పలు కేసులు కూడా నమోదయ్యాయి. ఇది టీడీపీ హత్య. చంద్రబాబు మీటింగు పెట్టి కందుకూరులో, గుంటూరులో చంపిన వారికి ఎంత నష్టపరిహారం అందించారు?. హత్యకు గురైన మహిళ టీడీపీకి చెందిన వారు, వారికి తెలుగుదేశం పార్టీ తరఫున నష్టపరిహారం అందించాలి. శవ రాజకీయాలు చేయటం చంద్రబాబుకు, వాళ్ల నాయకులకు అలవాటే.

– వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్

ట్రై స్కూటర్లు పంపిణీ చేసిన మంత్రి సురేష్



ట్రై స్కూటర్లు పంపిణీ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విభిన్న ప్రతిభావంతులకు ట్రై మోటారు స్కూటర్లను పంపిణీ చేశారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో మంజూరైన 10 ట్రై స్కూటర్లను ఆయన అందజేశారు. ఒక్కొక్క ట్రై స్కూటర్ రూ.1.20 లక్షల విలువైనవని, వీటిని విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం మంత్రి తనయుడు, జార్జి విద్యా సంస్థల సెక్రటరీ ఆదిమూలపు విశాల్ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొని కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్ పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు అర్చన, నియోజకవర్గంలోని 5 మండలాల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, సోషల్ మీడియా టీం సభ్యులు, కార్యకర్తలు, అభిమానుల పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను కట్టడి చేయాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో మాదక ద్రవ్యాల సాగు, వినియోగం, అక్రమ రవాణాలను పక్కాగా కట్టడి చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సంబంధిత అధికారులకు సూచించారు. ప్రకాశం భవనంలో డ్రగ్స్ నివారణపై బుధవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. మాదక ద్రవ్యాలు సాగు చేయకుండా, అక్రమ రవాణా జరగకుండా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు మరింత శ్రద్ధతో పనిచేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జీజీహెచ్‌లోని రీహాబిలిటేషన్ కేంద్రానికి నెలలో సుమారు 200 కేసుల వరకు వస్తున్నాయని, వాటిల్లో కిశోర బాలలు ఎక్కువగా ఉన్నారన్నారు. అందుకు కారణాలను గుర్తించి సమాజంలో మార్పు తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, సెబ్ ఎస్పీ అవులయ్య, ఏఎస్పీ నాగేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఒంగోలు ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్‌డీఓ అజయ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, మార్కెటింగ్ ఏడీ ఉపేంద్ర, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఈఓ అనితారోజ్‌రాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే రొయ్యలు కొనాలి

ఒంగోలు అర్బన్: ప్రభుత్వం నిర్ణయించిన రేట్లకే ఆక్వా రైతుల నుంచి రొయ్యలు కొనుగోలు చేయాలని ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో రొయ్యల కొనుగోలుపై ప్రాసెసింగ్ ప్లాంట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. కనీస మద్దతు ధర ఇప్పించాలని ఆక్వా రైతులు అడుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశంలో మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీ ఉషాకిరణ్, దేవీ సీ ఫుడ్స్, ముప్పంగి ప్రాసెసింగ్ ప్లాంట్, సదరన్ ట్రోపికల్, జీవీఆర్, కళ్యాణి ఆక్వా ప్రాసెసింగ్ ప్లాంట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూడో సంఘ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణరావు



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జూడో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకిషోర్‌రెడ్డి

ఒంగోలు: ప్రకాశం జిల్లా జూడో సంఘ అధ్యక్షుడిగా ఎం.లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం స్థానిక మాంటిస్సోరి స్కూలు ఆవరణలో జిల్లా కార్యవర్గ ఎంపిక నిర్వహించారు. నూతన కమిటీ ఎంపికను రాష్ట్ర జూడో సంఘ అధ్యక్షుడు ఆనం రామకిషోర్‌రెడ్డి పర్యవేక్షించారు. చైర్మన్‌గా పి.శబరీనాథ్, ప్రధాన కార్యదర్శిగా డి.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా పి.వెంకట నారాయణ, ఉపాధ్యక్షులుగా డీఎస్‌వీ సుధాకర్, సీహెచ్ మహేష్, సంయుక్త కార్యదర్శులుగా డీఎస్ కుమార్, ఎం.రాఘవేంద్ర, కార్యవర్గ సభ్యులుగా ఎస్‌డీ హలీమా, కె.మదన్ ఎంపికయ్యారు. నూతన కమిటీని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అభినందించారు.

వడదెబ్బకు వృద్ధురాలు మృతి

ముండ్లమూరు: మండలంలోని పోలవరం గ్రామంలో వడదెబ్బకు కుర్ర సీనమ్మ(85) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజులుగా వేడిగాలులు వీస్తుండటంతో అస్వస్థతకు గురై బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఆమె కుమారుడు పెద్దన్న చెప్పారు.

పిడుగుపాటుకు కార్మికుడు మృతి



మృతి చెందిన సుబ్బారావు

త్రిపురాంతకం: ఇటుక బట్టీలో పనిచేసే కార్మికుడు పిడుగుపాటుకు బలయ్యాడు. త్రిపురాంతకం మండలంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సోమేపల్లి గ్రామంలో ఇటుక బట్టీల వద్ద పిడుగు పడటంతో తూర్పుగోదావరి జిల్లా కాజులూరు మండలం ఉప్పెల్లి గ్రామానికి చెందిన బుంగా సూర్యనారాయణ(60) అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. హుటాహుటిన త్రిపురాంతకం పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇటుకల బట్టీలో పనిచేసేందుకు సూర్యనారాయణ వారం రోజుల క్రితం చిన్న కుమారుడితో కలిసి వచ్చాడు. మృతుడికి ఐదుగురు కుమారులు కాగా అందరికీ వివాహమైంది. సూర్యనారాయణ మృతి బట్టీ కార్మికులను ఆవేదనకు గురిచేసింది.

ఆక్రందన.. అంతకు మించిన వేదన!

- రోడ్డుపై గేదెను తప్పించబోయి బైక్ బోల్తా
- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ యువకుడు మృతి
- నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదానికి మృతుడి సోదరుడు బలి
- రెండు నెలల క్రితం మరో సోదరుడు ఆత్మహత్య
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



మృతి చెందిన కృష్ణ



శవాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న ఎస్సై కృష్ణపావని

హనుమంతునిపాడు: చేతికందివచ్చిన కుమారులు ఒకరి తర్వాత ఒకరు మృతి చెందడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. నాలుగేళ్ల క్రితం ప్రమాదంలో ఒకరు, రెండు నెలల కిందట ఆత్మహత్య చేసుకుని మరొకరు.. మంగళవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో ఇంకో కుమారుడు కన్నుమూయడం ఆ కుటుంబాన్నే కాదు గ్రామస్తులనూ కలిచివేసింది. వివరాల్లోకి వెళ్తే.. వేములపాడు గ్రామానికి చెందిన మద్దికుంట్ల నారాయణ, పద్మావతి దంపతులకు ముగ్గురు కుమారులు కృష్ణ, అశోక్, శివకుమార్ ఉన్నారు. నారాయణ తన పెద్ద కుమారుడు కృష్ణ(36)తో కలిసి పెద్దగొల్లపల్లిలో ఓ శుభకార్యానికి వంట చేసేందుకు వెళ్లారు. పని పూర్తయిన తర్వాత తండ్రిని ఇంటి వద్ద వదిలిపెట్టిన కృష్ణ తిరిగి పెద్దగొల్లపల్లికి వెళ్లాడు. అక్కడి నుంచి మంగళవారం అర్ధరాత్రి వేళ స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో పెద్దగొల్లపల్లి సమీపంలోని పాలకేంద్రం వద్ద రోడ్డుపై అడ్డుగా వచ్చిన గేదెను తప్పించబోయి అదుపుతప్పి పడిపోయాడు. కృష్ణ తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వేములపాడు ప్రైవేట్ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య అరుణ, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణపావని తెలిపారు. కాగా, రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరిని, ఆత్మహత్య రూపంలో మరో కుమారుడిని మృత్యువు కబళించడంతో తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఏం కష్టమొచ్చిందో ఆ తల్లికి..!

- రైలు కింద పడి మహిళ ఆత్మహత్య



రైల్వే ట్రాక్ పక్కన పడి ఉన్న పగడాల బుజ్జి మృతదేహం

దొనకొండ(దర్శి టౌన్): రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమైన ఓ మహిళ చివరి క్షణంలో మనసు మార్చుకుని తప్పించుకునేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృత్యువాతపడింది. ఈ విషాద ఘటన మంగళవారం అర్ధరాత్రి దొనకొండ రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. వినుకొండ పట్టణం దేవానగర్‌కు చెందిన పగడాల బుజ్జి(52) భర్త వీరయ్య 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో కుటుంబ పోషణ భారం ఆమెపై పడింది. వెల్లుల్లి, ఇతర వస్తువులు విక్రయిస్తూ తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడిని పెంచి పెద్ద చేసింది. అందరికీ వివాహాలు చేసింది. ఏం కష్టమొచ్చిందో తెలియదు కానీ మంగళవారం రాత్రి ఓ సంచిలో దుస్తులు పెట్టుకుని దొనకొండ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అర్ధరాత్రి దాటిన తర్వాత కొండవీడు ఎక్స్‌ప్రెస్ వస్తున్న సమయంలో రైల్వే ట్రాక్‌పై కొంత సేపు నిల్చుంది. చివరి క్షణంలో ఆత్మహత్యా యత్నాన్ని విరమించుకున్న ఆమె రైల్వే ట్రాక్ నుంచి పక్కకు తప్పుకునే క్రమంలో వేగంగా వస్తున్న ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. లోకోపైలట్ ఇచ్చిన సమాచారంతో రైల్వే ఎస్సై సుబ్బారావు, దొనకొండ రైల్వే పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి పూర్ణమహేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతురాలి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం వినుకొండ రైల్వేస్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ.. మృత్యు ఒడికి..

- ఆటో బోల్తా పడటంతో ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు



మృతుడు చిలంచర్ల సుబ్బారాయుడు(ఫైల్)



సుబ్బారాయుడు మృతదేహానికి నివాళులర్పిస్తున్న గఫార్, వైఎస్సార్ సీపీ నాయకులు

కనిగిరి రూరల్: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఆటో బోల్తా పడటంతో ఓ వృద్ధుడు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కనిగిరి–గార్లపేట ప్రధాన రోడ్డులో మోడల్ స్కూల్ మలుపు వద్ద మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కనిగిరి పట్టణంలోని బొగ్గులగొంది కాలనీకి చెందిన చిలంచర్ల సుబ్బారాయుడు(65) కుటుంబ సభ్యులు, వారి బంధువులు కలిసి మొక్కు తీర్చుకునేందుకు కామేపల్లి వద్ద గుడికి ఆటోలో వెళ్లారు. దైవ దర్శనం అనంతరం తిరిగి ప్రస్తుతం నివాసం ఉంటున్న బొగ్గులగొంది కాలనీలోని ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి జగనన్న కాలనీలో ఇంటి వద్దకు ఆటోలో వెళ్తుండగా కనిగిరి–గార్లపేట ప్రధాన రోడ్డులో మోడల్ స్కూల్ మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో చిలంచర్ల సుబ్బారాయుడు తల, గుండెకు బలమైన గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లవరపు వెంగయ్య అనే బాలుడిని గుంటూరులోని ఓ ఆస్పత్రికి తరలించగా, చిన్నా, కొండమ్మ స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలిని ఎస్సై దాసరి ప్రసాద్ పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడు సుబ్బారాయుడు భౌతికకాయాన్ని బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీను సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. క్షత గాత్రులను పరామర్శించారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిత

- విద్యార్థులకు ఎస్పీ మలికాగర్గ్ హితబోధ
- ముగిసిన చిల్డ్రన్ సమ్మర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ శిక్షణ



బహుమతులు అందుకున్న చిన్నారులతో పోలీసు అధికారులు

ఒంగోలు: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవడంతోపాటు క్రమశిక్షణతో మెలిగితే ఉజ్వల భవిత సొంతమవుతుందని ఎస్పీ మలికా గర్గ్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మే 3 నుంచి ప్రారంభమైన చిల్డ్రన్ సమ్మర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుక స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం ఉదయం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ.. చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో టీమ్ స్పోర్ట్స్, వ్యక్తిగత క్రీడలు, టీమ్ బిల్డింగ్ గేమ్స్, ఫిట్‌నెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ యాక్టివిటీలపై నిపుణులతో శిక్షణ ఇప్పించినట్లు పేర్కొన్నారు. చిన్నారుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక నైపుణ్యం, స్నేహభావం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఈ సమ్మర్ క్యాంపు ఎంతగానో దోహదపడిందని చెప్పారు. నిత్యం నేర్చుకునేతత్వాన్ని, పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని, తల్లిదండ్రులు, గురువులు, పెద్దల మంచి మాటలు వింటూ బాగా చదువుకుని బంగారు భవితకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. శిక్షణలో భాగంగా ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు ఏఆర్ అదనపు ఎస్పీ చేతులమీదుగా మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. క్యాంపును విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన పోలీసు అధికారులు, ఒంగోలు ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ రాజేంద్ర, బ్రేవ్ నేషనల్ క్రీడాకారులు, కోచ్‌లను ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు అభినందించారు.





శిక్షణలో భాగంగా ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులు

మత్తిచ్చి.. మాయ చేశారు!

- అర్ధరాత్రి వేళ మహిళకు మత్తు ఇచ్చి ఇంట్లో చోరీ
- 3 సవర్ల బంగారం, రూ.16 వేల నగదుతో పరారైన గుర్తు తెలియని వ్యక్తులు



తలమళ్లలో విచారిస్తున్న ఎస్సై మల్లికార్జునరావు

పొదిలి రూరల్: ఇంటి ఆవరణలో గాఢ నిద్రలో ఉన్న ఓ మహిళకు గుర్తు తెలియని దుండగులు మత్తు ఇచ్చి బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి పొదిలి మండలంలోని తలమళ్లలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నలమోలు ఆదెమ్మ ఒంటరిగా ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమె స్పృహ కోల్పోయేలా చేశారు. చెవులకు ఉన్న కమ్మలు తీసుకుని, అక్కడే ఉన్న తాళంచెవి సాయంతో ఇంటి తలుపులు తెరిచారు. ఇల్లు మొత్తం గాలించి 3 సవర్ల బంగారం తాడు, రూ.16 వేల నగదుతో ఉడాయించారు. ఆదెమ్మకు స్పృహ వచ్చి తేరుకున్న తర్వాత కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. ఎస్సై మల్లికార్జునరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో యువకుడు మృతి

పొదిలి: గుండెపోటుతో బి.ఫార్మసీ విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం పొదిలి మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. కనిగిరికి చెందిన ఎస్.బ్రహ్మేశ్వర్(20) కంభాలపాడులోని బిట్స్ కళాశాలలో బి.ఫార్మసి రెండో సంవత్సరం చదువుతున్నాడు. గుండె సంబంధిత వ్యాధి ఉండటంతో కనిగిరి నుంచే రోజూ కళాశాలకు రాకపోకలు సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆరోగ్యం బాగోలేక గత నాలుగు రోజులుగా కళాశాలకు రాలేదు. బుధవారం కళాశాలకు వచ్చిన వెంటనే అస్వస్థతకు గురికావడంతో పొదిలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు తరలించే ప్రయత్నంలో ఉండగా మృతి చెందాడు. విద్యార్థి మృతికి బిట్స్ విద్యా సంస్థల యాజమాన్యం బెల్లంకొండ శ్రీనివాస్, విజయలక్ష్మి, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.

గ్యాస్ లీకై దుకాణం దగ్ధం



దుకాణంలో చెలరేగుతున్న మంటలు

ముండ్లమూరు: గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగడంతో దుకాణం దగ్ధమైన సంఘటన ముండ్లమూరు మండలం మారెళ్ల గ్రామ బస్టాండ్ సెంటర్‌లో చోటుచేసుకుంది. సన్నెబోయిన ఏడుకొండలుకు చెందిన బుధవారం ఉదయాన్నే దుకాణం వద్దకు వచ్చారు. టీ పెట్టేందుకు ప్రయత్నిస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఏడుకొండలు, కుటుంబ సభ్యులు బయటకు పరుగు తీశారు. దుకాణంలో ఉన్న సరుకులు, ఫ్యాన్సీ వస్తువులు కాలి బూడిదయ్యాయి. మంటలు పక్క దుకాణాలకు వ్యాప్తి చెందకుండా స్థానిక వ్యాపారులు అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

సత్తా చాటిన నంద్యాల ఎడ్లు



బండ లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు గ్రామంలో అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన బత్తుల చిన్నబ్బాయ్ యాదవ్ ఎడ్లు 3,680 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.40 వేలు, కంభం మండలం ఎర్రబాలేనికి చెందిన వెంకటగిరి హేమలతానాయుడు ఎడ్లు 3,664 అడుగులతో ద్వితీయ బహుమతి రూ.30 వేలు, నరసరావుపేట మండలం పమిడి గ్రామానికి చెందిన జాగు నెమిలయ్య ఎడ్లు 2,917 అడుగులతో తృతీయ బహుమతి రూ.20 వేలు, నంద్యాల జిల్లా ఎస్.కొత్తపల్లెకు చెందిన ఎం.వెంకటేశ్వర్లు ఎడ్లు 2,764 అడుగులతో నాలుగో బహుమతి రూ.10 వేలు, నంద్యాల జిల్లా బోయలకుంట్లకు చెందిన షేక్ సుభహాన్ ఎడ్లు 2480 అడుగులతో ఐదో బహుమతి రూ.5 వేలు గెలుపొందాయి. ఆలయ కమిటీ సభ్యుల చేతులమీదుగా ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేశారు.

సహిత విద్య రిసోర్స్ పర్సన్‌ల బదిలీలకు అవకాశం

ఒంగోలు: భవిత/నాన్ భవిత కేంద్రాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న సహిత విద్య రిసోర్సు పర్సన్లకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి రిక్వెస్ట్ బదిలీలకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారని డీఈవో పి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బదిలీలు కేవలం ప్రిఫరెన్షియల్ కేటగిరీలకు మాత్రమే వర్తిస్తాయన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల్లోని వారు ప్రకాశం జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో ఈనెల 8,9 తేదీల్లో తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ/ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్, న్యూరో సర్జరీ, బోన్‌టిబి, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, స్పైనల్ సర్జరీ చేయించుకున్నవారు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులు కలవారు, పుట్టుకతో గుండె రంధ్రం ఉన్న పిల్లలున్నవారు, తలసీమియా, హీమోఫీలియా, మస్క్యులర్ డిస్ట్రోఫీ , జువైనల్ డయాబెటిస్ వంటి వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులు కలిగిన వారు రిక్వెస్ట్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సామాజిక బహిష్కరణపై విచారణకు బాధితులు గైర్హాజరు



సమావేశంలో పాల్గొన్న జేసీ శ్రీనివాసులు, ఇతర అధికారులు

సింగరాయకొండ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం ఊళ్లపాలెం పంచాయతీ దేవలంపల్లెపాలేనికి చెందిన కన్నా నాగరాజు కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేయడంపై జేసీ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెండోసారి బహిరంగ విచారణ నిర్వహించారు. శింగోతు శ్రీను మరో ఏడుగురు తనను గ్రామ బహిష్కరణ చేశారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ కర్నూలులోని మానవ హక్కుల కమిషన్‌ను కన్నా నాగరాజు ఆశ్రయించారు. దీంతో కమిషన్ ఆదేశాలపై అధికారుల బృందం గత నెల 27వ తేదీ శనివారం ఊళ్లపాలెం గ్రామంలో విచారణ నిర్వహించగా కన్నా నాగరాజు కుటుంబం గైర్హాజరైంది. దీనిపై రెండోసారి నిర్వహించిన బహిరంగ విచారణకూ నాగరాజు కుటుంబం గైర్హాజరు కాగా గ్రామంలోని మత్స్యకారులు మాత్రం హాజరయ్యారు. దీనిపై జేసీ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం వారంరోజులకన్నా ముందే వారికి సమాచారం ఇచ్చినప్పటికీ విచారణకు రాలేదని, వాస్తవ విషయాలను మానవ హక్కుల కమిషన్‌కు రాతపూర్వకంగా తెలియజేస్తామని పేర్కొన్నారు. ఇకపై గ్రామంలో అటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని, అంతా కలిసికట్టుగా ఉంటామని మత్స్యకారులు చెప్పినట్లు తెలిపారు. అడిషనల్ ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు ఆర్డీఓ కె.విశ్వేశ్వరరావు, తహసీల్దార్ సీహెచ్ ఉష, ఎస్సై మహమ్మద్ ఫిరోజ్‌ఫాతిమా, పంచాయతీ కార్యదర్శి షేక్ సైదులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల కోసం డయల్ యువర్ కలెక్టర్

- ప్రతి విద్యార్థి 70 శాతానికిపైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: హాస్టళ్లలో ఉండి చదువుకునే విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి నెలా ప్రత్యేకంగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహిస్తానని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. బుధవారం స్పందన భవనంలో సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులంతా 70 శాతానికిపైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా సంక్షేమ హాస్టళ్ల అధికారులు కృషి చేయాలన్నారు. విద్యార్థులను చదువుల పట్ల ప్రోత్సహించి మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. ప్రతినెలా హాస్టల్ అడ్వయిజరీ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులను, తల్లిదండ్రులను ఆహ్వానించాలని చెప్పారు. హాస్టళ్ల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ తెలుసుకునేందుకు జిల్లాలో ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఫీడ్‌బ్యాక్ ఆధారంగా గ్రీన్, రెడ్, ఎల్లో జోన్‌లుగా విభజించి నివేదిక అందచేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. వార్డెన్‌లు మూడు పూటలా హాస్టల్ విధులకు హాజరైనట్లు తెలిపేలా ఫొటోలు తీసి పంపాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వసతిగృహాల్లో నూరు శాతం సీట్లను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, బీసీ వెల్ఫేర్ అధికారి అంజల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళపై గొడ్డలితో దాడి

అర్ధవీడు(కంభం): మహిళపై ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన సంఘటన అర్ధవీడు మండలంలోని బోగోలు గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. వల్లెల పోలమ్మ అనే మహిళ మరో మహిళతో కలిసి సాయంత్రం బహిర్భూమికి వెళ్లి వస్తుండగా గ్రామానికి చెందిన చేగిరెడ్డి వెంకటరామిరెడ్డి అనే వ్యక్తి గొడ్డలితో దాడి చేశాడు. క్షతగాత్రురాలిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడికి పాల్పడ్డ చేగిరెడ్డి వెంకటరామిరెడ్డి ఇల్లు క్షతగాత్రురాలి ఇంటి సమీపంలో ఉంది. మంగళవారం రాత్రి తాము నిద్రిస్తున్న సమయంలో మద్యం తాగొచ్చి గొడవ చేసి వెళ్లాడని బాధితులు తెలిపారు. గతంలో కూడా పలుమార్లు మద్యం తాగి పలువురితో గొడవ పడిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఇతనిపై ఓ కేసు నమోదైంది.